సాక్షి రంగారెడ్డి

సోమవారం । 18 । నవంబర్ । 2024



తూకం.. జాగ్రత్తే ముఖ్యం

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించి కష్టానికి ప్రతిఫలం వచ్చే సమయం ఆసన్నమైంది. 8లో▸



మార్మోగిన శివనామస్మరణ

శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి వారి జాతర ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. 8లో▸



పర్యావరణ పరిరక్షణ..

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి అన్నారు. 8లో▸

కల్తీ కల్లు.. ఆరోగ్యానికి చిల్లు



క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ఫాజోలమ్‌లతో కల్లు తయారీ

- మోతాదుకు మించి రసాయనాలు కలపడంతో ప్రమాదం
- పట్టించుకోని జిల్లా ఎక్సైజ్ అధికారులు
- మామూళ్ల మత్తులో జోగుతున్న వైనం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో 'కల్తీ' కల్లు మాఫియా రెచ్చిపోతోంది. మోతాదుకు మించి రసాయనాలు కలిపి తయారు చేస్తున్న ఈ కల్లును తాగుతున్న అమాయక కూలీలు, పేదలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఎప్పటికప్పుడు కల్లు అమ్మకాలపై తనిఖీలు నిర్వహించి పరీక్షలు నిర్వహించాల్సిన శంషాబాద్, సరూర్‌నగర్ అబ్కారీ అధికారులు వారిచ్చే ముడుపులు పుచ్చుకుని కిమ్మనడం లేదనే ఆరోపణలున్నాయి. ఫలితంగా ఇటీవల మీర్‌పేటలోని నందనవనం బస్తీకి చెందిన ఓ మహిళ కల్తీకల్లు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. మోతాదుకు మించి రసాయనాలు కలిపి, కల్తీ కల్లును తయారు చేసి ప్రజారోగ్యంతో ఆటలాడుతున్న కల్తీ కల్లు మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన ఎక్సైజ్‌శాఖ వారికి అండగా నిలుస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బస్తీలే కల్లు కాంపౌండ్లకు అడ్డాలు

పకృతి సిద్ధమైన తాటి, ఈత చెట్ల నుంచి తీసిన కల్లు ఆరోగ్యకరమైంది. స్వచ్ఛమైన ఈ కల్లును సేవించడం వల్ల కిడ్నీ సంబంధిత సమస్యలు సైతం తొలగుతాయి. సాధారణంగా చెట్ల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట్ల కల్తీ తక్కువ. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడం, అప్పటి వరకు ఈ వృత్తిపై ఆధారపడిన గీత కార్మికులు కూడా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడం ఫలితంగా కల్లుకు కొరత ఏర్పడింది. మద్యం ధరలు ఎక్కువగా ఉండటంతో రోజువారీ కూలీలు కృత్రిమంగా లభించే కల్లుకు అలవాటుపడుతున్నారు. ప్రజల్లోని ఈ బలహీనతను కొంత మంది కల్లు వ్యాపారులు సొమ్ము చేసుకుంటారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ఫాజోలమ్ వంటి ప్రమాదకరమైన రసాయనాలను వినియోగించి కల్తీ కల్లును తయారు చేస్తున్నారు. తయారీలో మోతాదుకు మించి రసాయనాలను వినియోగిస్తుండడంతో దీన్ని సేవించిన వారు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరుతున్నారు. శంషాబాద్, రాజీవ్‌గాంధీనగర్, మీర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్, బొంగుళూరుగేటు, ఆదిబట్ల, యాచారం, చేవెళ్ల, షాద్‌నగర్, షాబాద్, కడ్తాల్ శివారు ప్రాంతాల్లో ఈ కల్తీ కల్లు విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నిజానికి ప్రస్తుత సీజన్‌లో తాటి చెట్లకు ఆశించిన స్థాయిలో కల్లు ఉత్పత్తి కాదు. ఒకటి రెండు తాటి చెట్ల నుంచి కల్లును సేకరించినా, ఇది వారి సొంత అవసరాలకు కూడా సరిపోదు. కానీ జిల్లాలోని ఏ ప్రధాన రోడ్డు వెంట చూసినా కృత్రిమ కల్లు దుకాణాలే దర్శనమిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఆయా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, నమూనాలు సేకరించాల్సిన ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒక లైసెన్సు.. రెండు దుకాణాలు

శంషాబాద్ పట్టణంలోని ఓ ప్రధాన కల్లు దుకాణంలో సభ్యుల మధ్య జరిగిన గొడవతో కల్లు విక్రయాలు రోడ్డుపైకి వచ్చాయి. గొడవల కారణంగా దాదాపు నెల రోజులుగా దుకాణం తెరవని విక్రయదారులు తమ దందాను మాత్రం యథేచ్ఛగా రోడ్డెక్కించారు. దాదాపు మూడు వందల సభ్యులతో ఉన్న ఈ దుకాణంలో కొంత కాలంగా వ్యాపారుల మధ్య గొడవలు కొనసాగుతున్నాయి. ఒకే దుకాణంలో రెండు వేర్వేరు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఎక్సైజ్ నిబంధనల మేరకు ఒక లైసెన్స్‌పై రెండు విక్రయ కేంద్రాలు నడిపిస్తున్న విషయం తెలుసుకున్న అబ్కారీ అధికారులు ఒక లైసెన్స్‌పై ఒకటే దుకాణం నడిపించాలని హెచ్చరించారు. వ్యాపారులు మాత్రం ఇదేమి పట్టనట్టుగా దందా కొనసాగిస్తున్నారు. రైల్వేస్టేషన్ నుంచి వీకర్ సెక్షన్ కాలనీ మీదుగా ఉన్న రోడ్డుపైనే కల్లు విక్రయాలు జరుపుతుండటంతో కాలనీ వాసులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఫలితం లేదు.

నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది

డైజోఫాం ఇతర రసాయనాలతో తయారు చేసిన కృత్రిమ కల్లును సేవించిన వారిలో నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. నీరసం, ఒంటి నొప్పులతో పాటు కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. మానసిక విచక్షణ కోల్పోయి పిచ్చిగా ప్రవర్తిస్తుంటారు. ఈ సమయంలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలకే ప్రమాదం. ఈ క్షతగాత్రులకు సర్జరీల సమయంలో నొప్పి నివారణ కోసం ఇచ్చే మత్తు ఇంజక్షన్లు సైతం పని చేయవు. మోతాదుకు మించిన డోసు ఇంజక్షన్లు ఇవ్వాల్సి వస్తుంది. సాధ్యమైనంత వరకు ఈ కల్లును సేవించక పోవడమే ఉత్తమం.

– డాక్టర్ రాజేశ్, న్యూరో సర్జన్



విజయోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, చిత్రంలో సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ అలేఖ్య పుంజాల తదితరులు

ప్రజా ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజా పాలన విజయోత్సవాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రజా ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన ఏడాది పూర్తవుతున్న తరుణంలో ఆదివారం పట్టణంలోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన విజయోత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, ఆర్డీఓ సరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్ల రాచరిక పాలనకు ప్రజలు చరమగీతం పాడి ప్రజా ప్రభుత్వానికి పట్టం కట్టారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా నెరవేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి ముందుకు సాగి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలందరికి చెప్పేందుకే ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహిస్తోందన్నారు.

ఆకట్టుకున్న ఆటా–పాట

ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు నిర్వహించిన ఆటా–పాటా ఆహుతులను అలరించాయి. అంతడుపుల నాగరాజు కళా బృందం సభ్యులు ప్రభుత్వం పథకాలను ఆటా పాట రూపంలో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, రఘునాయక్, బసిరెడ్డి నరేందర్‌రెడ్డి, తాండ్ర విశాల, శ్రావణ్‌కుమార్, కృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, చంద్రశేఖర్, సర్వర్ పాషా, మహ్మద్ ఇబ్రహీం, జమృద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



ఆరు గ్యారంటీలపై కళాకారుల ప్రదర్శన

న్యూస్‌రీల్

రాములుకు టీచర్ స్ఫూర్తి అవార్డు



రాములును సత్కరిస్తున్న శారదా ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వాహకులు

కొందుర్గు: విద్యార్థులకు 22 ఏళ్లుగా అందిస్తున్న సేవలకుగాను జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం రాములుకు టీచర్ స్ఫూర్తి అవార్డు వరించింది. శారదా ఎడ్యుకేషన్ సొసైటీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని భాస్కర ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాములు మాట్లాడుతూ.. అవార్డుతో తనపై బాధ్యత మరింత పెరిగిందని.. పేదల విద్యాభివృద్ధికి పాటుపడతానన్నారు. అవార్డు అందజేసిన నిర్వాహకులకు, శాతవాహన వర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్, కమలామనోహర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా అశోక్



నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు

ఆమనగల్లు: పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కొలుకులపల్లికి చెందిన మసన అశోక్ నియమితులయ్యారు. ఆదివారం సంఘం నిర్వహించిన కార్యాక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చ సుధాకర్‌రావు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. పద్మశాలీల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

'బుద్ధుడి నుంచి గద్దర్ వరకు..' పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జీవీవీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకుడు బొజ్జ భిక్షమయ్య రచించిన 'బుద్ధుడి నుంచి గద్దర్ వరకు..', ప్రముఖ రచయిత డాక్టర్ కాలువ మల్లయ్య రచించిన 'అస్పృశ్య యోధుడు' పుస్తకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా హాజరైన మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు మాట్లాడుతూ అభ్యుదయ శక్తులన్నీ ఏకం కావాలని, అందుకు తాను వారధిగా పని చేస్తానని చెప్పారు. కమ్యూనిస్టులు, అంబేడ్కరిస్టుల మధ్య అంతరం ఏర్పడిందని, ఆ అంతరాలను పూడ్చడానికి తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బి.ఎస్. రాములు తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికారానికి కృషి

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాములు



కొంగరకలాన్‌లో పార్టీ సభ్యత్వం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: బహుజన రాజ్యాధికారం సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పల్లాటి రాములు పిలుపునిచ్చారు. బీఎస్పీ అసెంబ్లీ కమిటీ ఆధ్వర్యంలో కోశాధికారి బంగరిగళ్ల మహేందర్ సమక్షంలో ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. జన కల్యాణ్ దివాస్‌ను ప్రారంభించిన అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు పల్లాటి రాములు మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దామన్నారు. అధికారం కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ అధ్యక్షుడు వంగల కృష్ణ ప్రసాద్, ఉపాధ్యక్షుడు గుండె శ్రీనివాస్, మంచాల మండల నాయకులు మల్లన్న పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతం

గ్రూప్–3 పరీక్షకు 50.3 శాతం అభ్యర్థుల హాజరు

ఇబ్రహీంపట్నం: గ్రూప్–3 తొలిరోజు పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. రెండు పేపర్ల పరీక్షలకు 50.3శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 11 కళాశాలల్లో 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 13,388 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కావాల్సివుండగా 6,735 మంది అభ్యర్థులు మాత్రమే హాజరవ్వగా.. 6,653 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9.30 గంటల దాటిన అనంతరం పరీక్ష కేంద్రానికి వచ్చిన అభ్యర్థులను లోనికి అనుమతించలేదు.

భారీగా ట్రాఫిక్ జామ్...

పరీక్ష కేంద్రం నుంచి సాయంత్రం 5.30గంటలకు ఒక్కసారిగా అభ్యర్థులు బయటకు వచ్చి గమ్యస్థానాలకు వెళ్లేందుకు రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. మంగళ్‌పల్లి చౌరస్తా, ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో గంటల తరబడి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పాడ్డాయి.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రూప్–3 పరీక్షలో ఎలాంటి అవకతవకలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఆదివారం నిర్వహించిన గ్రూప్–3 పరీక్ష కేంద్రాలను రంగారెడ్డి జిల్లాలోని తట్టి అన్నారంలోని శ్రేయాస్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల, హయత్‌నగర్ సమీపంలోని వర్డ్‌అండ్‌డీడ్ ఎడ్యుకేషన్ అకాడమీలో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రంలోని గదులను పరిశీలించారు. అభ్యర్థులకు ఏర్పాటు చేసిన వసతులను పర్యవేక్షించారు. పరీక్షలు జరిగే సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రెండు రోజుల పాటు నిర్వహించే పరీక్షలకు అధికారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కలెక్టర్ వెంట ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్, సంబంధిత అధికారులు ఉన్నారు.

మొయినాబాద్‌లో 25 శాతం..

మొయినాబాద్: గ్రూప్–3 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం పది పరీక్ష కేంద్రాల్లో 25.76 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. మొత్తం 6,726 మంది అభ్యర్థులకుగాను కేవలం 1,733 మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షకు రాయగా.. 4,993 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పర్యవేక్షించారు.



ఇబ్రహీంపట్నం రూరల్: అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మళ్లీ మొండి 'చేయి'!


- మహేశ్వరం మండలం హస్తం శ్రేణుల్లో అసంతృప్తి జ్వాలలు
- ఏఎంసీ చైర్మన్ పదవి మళ్లీ కందుకూరు మండలానికే
- కేఎల్‌ఆర్ తీరుపై మహేశ్వరం గిరిజన నేతల గుర్రు



చైర్మన్‌గా కృష్ణానాయక్ పేరును ప్రతిపాదిస్తున్న కేఎల్‌ఆర్

మహేశ్వరం: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్నిక కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాల రాజేసింది. మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయింది. దీంతో మహేశ్వరం, కందుకూరు ఎస్టీ నేతలు చైర్మన్ కుర్చీ దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాడిన నాటి నుంచి ఇప్పటి వరకు మూడు పర్యాయాలు కందుకూరు మండలానికి చెందిన వారే చైర్మన్‌గా ఉన్నారు. ఈ సారి మహేశ్వరం మండల వాసికి చైర్మన్ పదవి కట్టబెట్టి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ మరో మారు కందుకూరు మండలానికి చెందిన వారికే ఇచ్చేందుకు యత్నిస్తున్నారు. ఈ మేరకు చైర్మన్‌గా సభావత్ కృష్ణా నాయక్, వైస్ చైర్మన్‌గా జి.అంజయ్య ముదిరాజ్ పేరును ప్రతిపాదిస్తూ ఆదివారం మార్కెట్ కమిటీ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. విషయం తెలుసుకున్న మహేశ్వరం మండలానికి గిరిజన నేతలు కేఎల్‌ఆర్‌పై అసంతృప్తితో రగిలిపోతున్నారు. కేఎల్‌ఆర్ తమను నమ్మించి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ పటిష్టానికి బీఆర్‌ఎస్ నేతల అక్రమ కేసులకు బెదరకుండా పనిచేసినా తమను విస్మరించడం సరికాదంటున్నారు. ఏక పక్షంగా ఎంపిక చేయడం తగదంటున్నారు. ఈ మేరకు కేఎల్‌ఆర్ తీరును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు మహేశ్వరం హస్తం శ్రేణులు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా కేఎల్‌ఆర్ పునరాలోచించి మహేశ్వరం మండలానికి చెందిన గిరిజన నేతలకు ఏఎంసీ చైర్మన్ పదవి కట్టబెట్టి మాట నిలబెట్టుకోవాలని లేదంటే పార్టీకి తీవ్ర నష్టం ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

సర్వేలో వివరాలు ఇచ్చిన హైదరాబాద్ కలెక్టర్



సర్వేలో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

బంజారాహిల్స్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమాచార సేకరణ కోసం చేపట్టిన సమగ్ర సర్వేలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తమ పూర్తి వివరాలను ఎన్యుమరేటర్‌కు అందజేశారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్ –13లోని కలెక్టర్ బంగ్లాకు వెళ్లిన సూపర్‌వైజర్ బాహుసింగ్, ఎన్యుమరేటర్ శాంతిలక్ష్మీలు ఆయనకు 75 ప్రశ్నలతో కూడిన సర్వే ఫారాన్ని అందజేశారు. క్షుణ్ణంగా దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అందులోని అన్ని ప్రశ్నలకు వివరాలు నమోదు చేసి అధికారులకు అందజేశారు. సమగ్ర సర్వే జరుగుతున్న తీరును వారిని అడిగి తెలుసుకున్నారు.



అమ్మవారి రథం లాగుతున్న భక్తజనం

• వైభవంగా రథోత్సవం

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి నిర్వహించిన నిర్వహించిన పెద్ద తేరు రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. గర్భగుడిలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు రథంపై ఉంచారు. అనంతరం భక్తులు పోటీ పడుతూ అమ్మవారి రథాన్ని ఆలయ పరిసరాల్లో ఊరేగించారు. అమ్మవారి నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. రథోత్సవం సందర్భంగా సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్‌ట్రస్టీ శిరోలి, ఈఓ స్నేహలత, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, స్థానిక నాయకులు జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు సాధించుకోవాలి

మహిళా సమాఖ్య
జిల్లా ప్రధాన కార్యదర్శి షైమిదా


సభ్యత్వ నమోదు పత్రాలు అందజేస్తున్న షైమిదా, యాదమ్మ

మీర్‌పేట: మహిళల రక్షణ, హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.షైమిదా పిలుపునిచ్చారు. ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి సిర్లాహిల్స్‌లో సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి బండ యాదమ్మ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న షైమిదా మాట్లాడుతూ.. సమాజంలో రోజు రోజుకు మహిళల పట్ల వివక్ష కొనసాగడంతో పాటు హింస పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కావున మహిళా సమాఖ్యను బలోపేతం చేసి దక్కాల్సిన హక్కుల కోసం సమష్టిగా పోరాడి సాధించుకోవాలని అన్నారు. అనంతరం కాలనీ మహిళలకు సభ్యత్వాన్ని అందజేశారు.


పూజల్లో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి

వైభవంగా పడిపూజ

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని హస్తినాపురం డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్‌లోని హరిహర క్షేత్ర అయ్యప్ప దేవాలయంలో దేవాలయం కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప పూజలు ఘనంగా నిర్వహించారు. హంపి విరూపాక్ష విద్యారణ్య భారతిమహాస్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమణ గురుస్వామి, మల్లికార్జున్ గుప్తా పాల్గొన్నారు.

రెయిన్‌బో నందనవనంలో..

రెయిన్‌బో నందనవనంలో దుర్గాప్రసాద్, అరిగె శ్రీను, నరేందర్‌రెడ్డి గురుస్వాముల ఆధ్వర్యంలో హైకోర్టు అడ్వొకేట్ ప్రదీప్‌కుమార్ నిర్వహించిన అయ్యప్ప పూజకు భక్తులు పోటెత్తారు. సూర్యాపేట భజన బృందం ఆలపించిన భక్తిగీతాల నడుమ మనికంఠుడి పల్లకీ సేవ వైభవంగా కొనసాగింది. పూజల్లో నందనవనం ప్రెసిడెంట్ భాస్కర్ గౌడ్, సీహెచ్.సురేశ్, మల్లికార్జున్, ఎన్.శ్రీనివాస్, శ్రీనివాసరావు, చంద్రమౌళి, ఎస్.రామకృష్ణ, రిషి యాదవ్ పాల్గొన్నారు.


అభిషేకం చేస్తున్న ప్రదీప్‌కుమార్ దంపతులు

నడిరోడ్డుపై హంగామా

గంజాయి మత్తులో కొట్టుకున్న
ఇద్దరు ఆటో డ్రైవర్లు

చార్మినార్: చార్మినార్ ఆర్టీసీ బస్టాప్ రోడ్డులో ఇద్దరు ఆటో డ్రైవర్లు ఆదివారం సాయంత్రం హంగామా చేశారు. మద్యం మత్తులో కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఎవరు.. ఎవరిని.. ఎందుకు.. కొడుతున్నారో వారికే తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు ముచ్చెమటలు పట్టించారు. దీంతో గంటల తరబడి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. కొంత మంది వాహన దారులు సర్ది చెప్పే ప్రయత్నం చేయడంతో వారిని సైతం నెట్టివేస్తు దుర్భాషలాడారు.

కనిపించని పోలీసులు...

ఇంత జరుగుతున్నా...సంఘటనా స్థలానికి పోలీసులు సకాలంలో రాకపోవడం గమనార్హం. అసలే వీకెండ్ అయిన ఆదివారం కావడంతో సహజంగానే సాధారణ రోజుల కన్నా..ఆదివారం సందర్శకుల రద్దీ ఎక్కువగా ఉంది. గతంలో తొలగించిన చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్ భవనం ఎదురుగా ఉన్న ప్యారిస్ కేఫ్ రోడ్డులో ఈ గలాటా జరిగింది. ఇక్కడ లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు ట్రాఫిక్ పోలీసు లు సైతం విధినిర్వాహణలో కనిపించ లేదు. ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ సంఘటన చార్మినార్, హుస్సేనీఆలం, మొఘల్‌పురా లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్ల సరిహద్దులో జరిగింది. అయితే సంఘటన జరిగిన ప్రదేశం మొఘల్‌పురా పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుందని పోలీసులు చెబుతున్నారు.

తూకం.. జాగ్రత్తే ముఖ్యం

- ధాన్యం అమ్మకంలో రైతుల అప్రమత్తతే కీలకం
- దళారులను నమ్మితే అన్నదాతల దగా
- అధికారుల తనిఖీలతో మోసాల అడ్డుకట్ట


ధాన్యం బస్తాలను కాంటా వేస్తున్న కూలీలు

షాద్‌నగర్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వస్తుంది. పంటను విక్రయించి కష్టానికి ప్రతిఫలం వచ్చే సమయం ఆసన్నమైంది. ఈ సమయంలో దళారులు పల్లెల్లో తిరుగుతూ అన్నదాతలకు ఆశ చూపిస్తూ మోసం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దళారులు, మధ్యవర్తులు చేసే మోసాల బారిన పడకుండా ఉండాలంటే అన్నదాతలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

రైతులు ఖరీఫ్‌లో సాగు చేసి పండించిన పంటల ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. ఈ కేంద్రాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేసి సరైన మద్దతు ధర చెల్లిస్తున్నారు. అయితే ప్రభుత్వం కేంద్రాలతో పాటుగా పల్లెల్లో దళారులు కూడా ధాన్యాన్ని కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ సమయంలో రైతులు అప్రమత్తంగా ఉంటేనే మోసాలకు అడ్డుకోవచ్చు.

వీటిపై నిఘా అవసరం

పల్లెల్లో కొనుగోలు సమయంలో వ్యాపారులు కొత్త రకం మోసాలకు తెరలేపుతున్నారు. ధాన్యాన్ని ఎలక్ట్రానిక్ కాంటాల్లో తూకం వేస్తున్నారు. అయితే వ్యాపారులు ఈ కాంటాకు రిమోట్ అమరికరాలను అమర్చి రైతులను మోసం చేసే అవకాశం ఉంది. కాంటాకు కొద్ది దూరంలో కూర్చొని ఎవరికీ కనిపించకుండా రిమోట్‌తో తేడాలు చేయవచ్చు. ఇలాంటి ఘటనలు గతంలో ఎన్నో చోటు చేసుకున్నాయి.

- ప్రభుత్వం ఇచ్చే ధర కంటే అధిక ధర చెల్లిస్తామని వ్యాపారులు రైతులకు ఆశ చూపి నమ్మించే ప్రయత్నం చేస్తారు. ఇలాంటి వారు ఎక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి సమయానికి డబ్బులు ఇవ్వకుండా రైతులను మోసం చేస్తుంటారు.
- అదే విధంగా వ్యాపారులు నేరుగా కల్లాలు, ఇళ్ల వద్దకే వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. వారి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. పెద్ద తక్కెడల్లో తూకం వేసినప్పుడు బాట్లకు బదులుగా కొందరు బండరాళ్లు, ధాన్యం నింపిన బస్తాలను పెడుతుంటారు. దీంతో సరైన తూకం రాక రైతులు మోసపోయే అవకాశాలు ఉంటాయి.
- ధాన్యాన్ని తూకం వేసేటప్పుడు వ్యాపారులు రైతులను మాటల్లో ముంచి తూకంలో తేడాలు చేసేందుకు ప్రయత్నిస్తారు.

అవగాహన పెంచాలి

పంట చేతికొచ్చే సమయంలో వ్యాపారులు గ్రామాల్లో విస్తృతంగా తిరుగుతూ రైతులను మోసాలకు గురి చేసే అవకాశం ఉంది. అయితే ఈ సమయంలో రైతులు మోసాలకు గురి కాకుండా అధికారులు వారిని చైతన్య పరచాలి. గ్రామాల్లో అధికారులు నిఘా పెంచి అన్నదాతలు మోసాలకు గురి కాకుండా చూడాలి. రైతులను మోసం చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహించాలి

నమ్మి మోసపోవద్దు



రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మంచి మద్దతు ధర పొందాలి. దళారులు నేరుగా గ్రామాలకు వచ్చి కొనుగోలు చేస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసే అవకాశాలు ఉంటాయి. రైతులు అప్రమత్తంగా ఉండాలి

– రఘునందన్, సీఈఓ, పీఏసీఎస్, షాద్‌నగర్

వర్గీకరణ వ్యతిరేక సభను జయప్రదం చేయాలి

రాజేంద్రనగర్: వర్గీకరణ పేరిట మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ డిసెంబర్ 1వ తేదీన నిర్వహించనున్న మాలల సింహ గర్జన సభను మాల సోదరసోదరిమణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని వర్గీకరణ వ్యతిరేక కమిటీ చైర్మన్ మన్నె శ్రీధర్ కోరారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని లైబ్రరీ వద్ద నిర్వహించిన రాజేంద్రనగర్ నియోజకవర్గ మాల ముఖ్య నేతల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మన్నె శ్రీధర్ మాట్లాడుతూ... డిసెంబర్ 1వ (ఆదివారం) తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్ జింఖానా మైదానంలో సభ జరుగుతుందన్నారు. దళితుల మధ్య చిచ్చుపెట్టేలా చేసిన వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని మాల సంఘాలన్నీ కలిసి సింహగర్జన బహిరంగ సభను నిర్వహింప తలపెట్టామన్నారు. సభను విజయవంతం చేసేందుకు మాల కులస్తులు, స్థానిక పంచాయతీ, కమిటీ పెద్దలు, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, అంబేడ్కర్ యువసేన సభ్యులంతా కలిసి ప్రతి మాలను కలిసి సమస్యను వివరిస్తూ కరపత్రాలను అందించి సభకు వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర కన్వీనర్ బలవంత రావు, నేతలు పచ్చ శ్రీనివాసులు, వీరన్న, గొడుగు సంజీవ, పచ్చ నర్సింగ్ రావు, పంబల రాజు, పచ్చ అనిత, వేము వందనం, పత్యారా రాజు, దాసరి రమేశ్, శ్రీశైలం, ఎస్.మద్దెల శంకర్, పెంటయ్య, పెంద్యాల శ్రీకాంత్, గొడుగు నర్సింగ్ రావు, పాలమాకుల రాజు, మురళీ, గణేష్, నర్సింగ్ రావు, పెంద్యాల రవీందర్, కార్తీక్ మోహన్, మురళీ, అశోక్, పత్యారా నరసింహ, బి.భరత్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సాక్షి రంగారెడ్డి జిల్లా: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం యాచారం పోలీసులు సీజ్ చేశారు. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. కడ్తాల్ మండలం పల్లెచల్క తండాకు చెందిన వస్లావత్ బాధ్య యాచారం మండల పరిధిలోని నందివనపర్తి, చింతుళ్ల తదితర గ్రామాల్లో తక్కువ ధరకు ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి ఒక ప్రైవేట్ వాహనంలో పల్లెచల్కతండాకు తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న యాచారం పోలీసులు నందివనపర్తిలో తనిఖీలు చేపట్టగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాధ్యుడైన వస్లావత్ బాధ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం

మార్మోగిన శివనామస్మరణ

బుగ్గ రామలింగేశ్వర జాతరకు పోటెత్తిన భక్త జనం

మంచాల: కార్తీక మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి వారి జాతర ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసాయి. ఆలయ ప్రాంగణంలో శివనామస్మరణ మార్మోగింది. భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.


స్వామి దర్శనం కోసం పోటీ పడుతున్న భక్తులు

పూజ కోసం తెచ్చిన విగ్రహాల చోరీ

నిందితుల కోసం
గాలిస్తున్న పోలీసులు

మీర్‌పేట: పూజ కోసం తెచ్చిన దేవతామూర్తుల పంచలోహ విగ్రహాలను దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. టీచర్స్ కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో స్థానిక అయ్యప్ప మాలధారులు పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం పూజ ఉండడంతో అయ్యప్ప సేవా సమితి వారి నుంచి అయ్యప్పస్వామి, గణపతి, సుబ్రమణ్య స్వామి వార్ల పంచలోహ విగ్రహాలను తీసుకొచ్చి గుడి ఆవరణలో ఉంచారు. రాత్రి 12 గంటల వరకు పూజలు చేసిన అయ్యప్ప స్వా ములు అనంతరం వెళ్లిపోయారు. ఉదయం 5 గంటలకు తిరిగి ఆలయం వద్దకు రాగా విగ్రహాలు కనిపించలేదు. విషయం తెలుసుకున్న ఆలయ చైర్మన్ కొండల్‌రెడ్డి అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి విగ్రహాలను చోరీ చేసినట్లు మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దొంగలను పట్టుకునేందుకు నాలుగు బృందాలతో గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

కత్తితో దాడి

చాంద్రాయణగుట్ట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఆసుపత్రి చికిత్స విషయంలో తలెత్తిన వివాదంలో రౌడీషీటర్.. ఓ కుటుంబంపై కత్తులతో దాడి చేసిన సంఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... సంజయ్‌గాంధీనగర్ నవాబ్‌సాబ్‌కుంటకు చెందిన వాహబ్ కామాటిపురా మీదుగా కారులో ప్రయాణిస్తుండగా ఓ యువకుడు (19) ద్విచక్ర వాహనంపై వచ్చి కారును ఢీకొని గాయాలకు గురయ్యాడు. వాహబ్ తన బంధువైన గఫూర్ ఖాన్‌కి సమాచారంఅందించాడు. హుటాహుటినా అతడిని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా గఫూర్ ఖాన్‌కు రౌడీషీటర్ అసద్ ఫోన్ చేసి దూషించడం మొదలుపెట్టాడు. దీంతో నీ అడ్రస్ చెప్పు అన్ని అడగగా గఫూర్ ఖాన్ తెలపడంతో శనివారం రాత్రి అసద్ మరో నలుగురితో కలిసి వచ్చి కత్తితో గాయపరిచాడు.

సందడిగా కార్తీక వనభోజనాలు


గోపూజ చేస్తున్న భక్తులు

మణికొండ: కార్తీక మాసం సదర్భంగా వివేక భారతి యోగా శాఖ ఆధ్వర్యంలో మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ అనంత పద్మనాభ స్వామి ఆలయం ఆవరణలో ఆదివారం వనభోజనాలను సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ నిర్వహించి కార్తీక మాసం ప్రాముఖ్యతను వివరించారు. హనుమాన్ చాలీసా పారాయణం అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం భజనలు, కీర్తనలు, సాంస్కృతిక క్విజ్, శ్లోక పఠనం నిర్వహించారు. వక్త మలిపెద్ది శంకర్, ఎ.పవన్‌కుమార్, శ్వేతా పవన్, మోహన్‌రెడ్డి, కిరణ్, రాజు, సత్యనారాయణమూర్తి, రవి, అనిల్, సాయిబాబ, ఎ.లక్ష్మణ్‌రావు, దిపిల్ కక్కడ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి
- రంగారెడ్డి జిల్లా కన్హాశాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ రన్‌ను ప్రారంభించిన సీపీ


జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న సీపీ అవినాష్ మహంతి

నందిగామ: పర్యావరణ పరిరక్షణకు శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీమని.. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కన్హా శాంతివనం హార్ట్‌ఫుల్‌నెస్ కేంద్రంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ అండ్ ఫిట్ ఇండియా సహకారంతో గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ రన్‌ను సీపీ అవినాశ్ మహంతి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామ చంద్ర మిషన్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా పలు కేంద్రాల్లో 2కే, 5కే, 10కే, 21కే రన్ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ రన్‌లో యువతతో పాటు అన్ని వయస్సుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. అనంతరం హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్న రన్‌లో సుమారు 40వేల మంది, కన్హాలో 7వేల మందికి పైగా పాల్గొన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి నుంచి స్వీకరించిన ఎంట్రీ ఫీజుతో మొక్కలు నాటేందుకు ఖర్చు చేస్తామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా, ఐఆర్ఎస్ అధికారి ఎన్.బలరామ్, పారిస్‌లో ఇటీవల నిర్వహించిన టీ–20లో 400 మీటర్ల పోటీల్లో కాంస్య పతకం సాధించిన దీప్తీ, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, యువత, క్రీడాకారులు, పలువురు అభ్యాసీలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు పెట్టొద్దు

సాక్షి రంగారెడ్డి జిల్లా: ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఆందోళన తప్పదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందని, అధికారులు పెట్టే నిబంధనలతో రైతులేవరూ ధాన్యం విక్రయించే విషయంలో ఆసక్తితో లేరని అన్నారు. నాణ్యత ప్రమాణాల పేరుతో అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయడంతో తక్కువ ధర వస్తున్న దళారులకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిబంధనలు సడలిస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుందని అన్నారు. లేని పక్షంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

చెరువులో పడి యువకుడి మృతి


ఈశ్వర్ మృతదేహం

తలకొండపల్లి: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ విష్ణు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వద్దే ఈశ్వర్(36) సమీపంలోని సహదేవి సుర సముద్రంలో చేపలు పట్టడానికి ఆదివారం సాయంత్రం వెళ్లాడు. చెరువులో వల వేసి పక్కనున్న చెట్లకు కట్టుతున్న తరుణంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. ఈశ్వర్ కనిపించక పోవడంతో అక్కడ ఉన్న స్థానికులు చెరువులో వెతికారు. కాసేపటికి ఆయన లభ్యం కావడంతో, గట్టు మీదకు తీసుకువచ్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ ఎర్రబోడా పోచమ్మ దేవాలయం వెనుక ప్రాంతంలోని సర్వే నంబర్–7లో ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. దాదాపు 400 గజాల ఈ ఖాళీ స్థలంలో గతంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేశారని వారు తెలిపారు. అయితే కొందరు శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు కబ్జా చేస్తూ పనులను చేపట్టారని ఆరోపించారు. సెలవు దినం కావడంతో కబ్జాకు పాల్పడుతున్నారని ఈ విషయంలో రాజేంద్రనగర్ రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేయాలని కోరారు. గతంలో తహసీల్దార్‌తో పాటు రాజేంద్రనగర్ ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేయగా బోర్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలం అనే బోర్డు ఉన్నా కొందరు దర్జాగా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. సోమవారం ఎర్రబోడావాసులు అందరూ కలిసి ఎమ్మెల్యేతో పాటు తహసీల్దార్‌ను కలిసి మరోసారి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.